డయాలసిస్ యూనిట్ ప్రారంభం



డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని సామాజిక ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్‌ను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గలత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సొసైటీ చైర్మన్ మల్లారెడ్డి

శంషాబాద్: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్‌ను గురువారం చైర్మన్ మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కొత్త సంవత్సరంలో రైతుల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జ్ఞానేశ్వర్, డైరెక్టర్లు కరుణాకర్‌రెడ్డి, అరుంధతి, సత్తయ్య, సురేందర్‌రెడ్డి, సులోచన, సీఈఓ అర్జున్ పాల్గొన్నారు.

మహవీర్ కళాశాలలో ట్రెడిషనల్ డే



ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: మహవీర్ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కళా సంస్కృతిని పెంపొందించేందుకు ట్రెడిషనల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి అలరించారు. అనంతరం విద్యార్థినులకు, అధ్యాపకులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు భారత కళలను కూడా నేర్చుకోవటం ద్వారా తమ సృజనాత్మకత శక్తిని పెంపొందించుటకు ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



ఏజీవర్సిటీ: రాజేంద్రగనగర్‌లోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో గురువారం ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియెట్ డీన్ ప్రశాంత్ మాట్లాడుతూ..ఉద్యాన రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకొని ఇతరులకు ఆదర్శ ప్రాయాలుగా నిలవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలలో అలరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్స్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డును పూర్తిస్థాయిలో వేయాలి

రాజేంద్రనగర్: ఎన్ఐఆర్‌డీ చౌరస్తా నుంచి ఎన్ఐఆర్‌డీ ప్రధాన ద్వారం వరకు రోడ్డును వేయాలని స్థానిక ప్రాంత వాసులతో పాటు వాహనదారులు, వ్యాపారస్తులు కోరుతున్నారు. ఒక పక్క రోడ్డు వేసి మరో పక్క వదిలేయడంతో ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఈ దారి గుండా ప్రయాణించే వాహనదారులు అదుపు తప్పి పడుతున్నారని తెలుపుతున్నారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, వికలాంగులు ఈ రోడ్డును దాటేందుకు నానా ఆగచాట్లు పడుతున్నారి తెలుపుతున్నారు. గతంలో ఒక పక్క సీసీ రోడ్డు వేశారని..అనంతరం ఈ పనులను నిలుపుదల చేశారని వెల్లడించారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డును పూర్తిస్థాయిలో వేయాలని కోరుతున్నారు.

హెచ్‌ఎండీఏ ఆదేశాలు బేఖాతరు

- గతంలో నిలిపివేసిన వెంచర్లలో మళ్లీ పనుల జోరు
- త్వరలో విలీనమవుతుందని రెచ్చిపోతున్న అక్రమార్కులు
- పట్టణంలో పత్తాలేని టౌన్‌ప్లానింగ్



హెచ్‌ఎండీఏ ఆదేశాలను ఉల్లంఘిస్తూ చేపడుతున్న నిర్మాణం, రహదారులు



శంషాబాద్: అక్రమార్కులు మళ్లీ రెచ్చిపోతున్నారు. హెచ్‌ఎండీఏ ఆదేశాలు కాస్తా పక్కన పెట్టేస్తున్నారు. త్వరలో జీహెచ్‌ఎంసీలో మున్సిపాలిటీ విలీనమైతే తమ పప్పులుడవేమోనని రెచ్చిపోతున్నారు. తమకు అనుకూలమైన ప్రజా ప్రతినిలున్నప్పుడే అక్రమ 'ఇళ్ల'చక్కదిద్దుకునే పనిలో బిజీగా ఉన్నారు. పట్టణంలో టౌన్‌ప్లానింగ్ విభాగం మాత్రం తమకేమి పని అన్న తీరుగా వ్యవహరిస్తోన్న తీడు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతోంది.

ప్రజా ప్రతినిధుల ఆదేశాలతో..

శంషాబాద్ మున్సిపాలిటీలో సాతంరాయితో పాటు హెచ్‌ఎండీఏ సొంతంగా అభివృద్ధి చేసిన న్యూ హుడా కాలనీలో మాత్రమే గృహ నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తారు. మిగతా ప్రాంతమంతా జీవో 111 కారణంగా లేవుట్, నిర్మాలకు ఎలాంటి అనుమతి లేదు. శంషాబాద్ మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ అధికారి వారంలో కేవలం రెండు రోజులు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తారు. మిగతా పనిదినాలు మరో రెండు మున్సిపాలిటీల్లో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. దీంతో టౌన్‌ప్లానింగ్‌లో ఓ ప్రభుత్వ ఉద్యోగి మినహా మిగతా పనిచేసే సిబ్బంది ఔట్‌సోర్సింగ్ మాత్రమే.. దీంతో పట్టణంలో లెక్కలేననన్ని అక్రమ నిర్మాణాలు, లేఅవుట్‌లు నియంత్రించడంలో తీవ్రంగా విఫలమవుతోంది. ఒక వేళ కొన్ని సందర్భాల్లో చర్యలు తీసుకున్నా ప్రజా ప్రతినిధుల ఆదేశాలతో మళ్లీ వాటివైపు తొంగి చూసే పరిస్థితి లేకుండా పోతోంది.

ఆదేశాలు..బుట్టధాఖలు

పట్టణంలో అక్రమ లేఅవుట్‌లకు అనుమతి లేకపోవడంతో అక్రమార్కులు వాటిని గుంటల లెక్కన విక్రయిస్తున్నారు. ఈ విషయం ఏడాది కిందట హెచ్‌ఎండీఏ అధికారుల దృష్టికి వెళ్లడంతో పలు లేఅవుట్‌లను నిలిపివేశారు. వాటిలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండా చూడాలని మున్సిపాలిటీకి సూచించారు. దీంతో పనులు నిలిపివేసిన సదరు అక్రమ లేఅవుట్ నిర్వాహకులు ఇటీవల మళ్లీ తమ అక్రమ లేఅవుట్‌లలో జోరుగా పనులు చేపడుతున్నారు. హెచ్‌ఎండీఏ ఆదేశాలను బుట్టదాఖలు చేశారు. పట్టణంలోని సర్వేనంబరు 51 తదితర ప్రాంతాల్లో జోరుగా అక్రమ లేఅవుట్‌లతో పాటు అందులో భారీ నిర్మాణాలు జోరందుకున్నాయి. ధర్మోజి కుంట సమీపంలో కూడా ఓ భారీ భవనంతో పాటు షెడ్లు నిర్మాణం కూడా ఊపందుకుంది. మున్సిపాలిటీ జీహెచ్‌ఎంసీలో విలీనం కాకముందే తమ అక్రమాలన్నింటిని చక్కదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు ఇంటి నెంబర్లు ఇప్పించి అవే అనుమతులుగా అంటగడుతూ కొందరు ప్రజాప్రతినిధులు ఇప్పటికే భారీగా సొమ్ముచేసుకున్నారు. మరో 20 రోజులే ఉండడంతో ప్రస్తుతం ఇంటి నెంబర్లు ఇప్పించే పనిలో కొందరు కౌన్సిలర్లు మున్సిపాలిటీ క్యూ కడుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

సర్వేనంబరు 51లో ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదు. అక్రమ నిర్మాణాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. టౌన్‌ప్లానింగ్ అధికారులు సదర సర్వేనంబర్లలో పరిశీలిస్తారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు.
– బి. సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

నేడు ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి



వినతిపత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు

మణికొండ: అనుదినం ప్రజల శ్రేయస్సు కోసం శ్రమించే ఆశ వర్కర్ల సమస్యలపై అనేక ధర్నాలు, బస్సు యాత్రలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి చేసి ధర్నా నిర్వహిస్తామని సీఐటీయూ మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆశ వర్కర్లతో కలిసి నార్సింగిలోని ప్రాథమిక వైద్య కేంద్రంలో అధికారులకు వారి సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, కనీస వేతనం రూ.18వేలు కల్పించాలని అనేక పోరాటాలు చేశామన్నారు. అయినా ప్రభుత్వంలో కదలిక రావటం లేదన్నారు. దీంతో శుక్రవారం ఎమ్మెల్యేల ఇంటి ముందు ధర్నా చేయాలని నిర్ణయించామని, నియోజకవర్గంలోని ఆశ వర్కర్లు అంతా తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గండిపేట మండల ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలను సహించం

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



నెక్నాంపూర్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ తదితరులు

మణికొండ: చెరువులు, నాలాల, వాగుల బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలలో వచ్చిన అక్రమ నిర్మాణాలను సహించే ప్రసక్తే లేదని, వాటి ఆక్రమణలను వెంటనే తొలగించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌అన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మూసీ వాగు, మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చెరువు పరిసరాలను పరిశీలించారు. నార్సింగిలో మూసీ నదిలో పోసిన మట్టిని తొలగించాలని రెండు వారాల క్రితం రాజపుష్ప, ఆదిత్య నిర్మాణ సంస్థలను ఆయన ఆదేశించారు. వాటి పనులు ఎక్కడి వరకు వచ్చాయనే విషయాన్ని ఆయన గురువారం పరిశీలించారు. మూసీ నదిలోకి జరిగి సదరు నిర్మాణ సంస్థలు పోసిన మట్టిని తొలగిస్తున్న పనులను ఆయన పరిశీలించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ ఫ్రంట్ అధికారులను హద్దులు నిర్ణంచాలని గతంలో ఆదేశించటంతో వారు వాటిని ఏర్పాటు చేశారు. అక్కడి వరకు మట్టిని పూర్తిగా తొలగించాలన్నారు. ఆదిత్య నిర్మాణ సంస్థ వారు మరో వారం రోజుల్లో మట్టిని తొలగిస్తామన్నారు. అనంతరం ఆయన నెక్నాంపూర్ చెరువు పరిసరాలలోని పూజ హోమ్స్ వారు చెరువు బఫర్ జోన్‌లో ఏర్పాటు చేసిన షెడ్‌లను తొలగించాలని గతంలో ఆదేశించారు. గురువారం వాటిని తొలగించటంతో పరిశీలించారు. అక్కడ పోసిన మట్టిని సైతం తొలగించాలన్నారు. నెక్నాంపూర్ చిన్న చెరువునుంచి బయటకు వస్తున్న నీటి కాలువ పక్కనే కొత్తగా వస్తున్న విల్లా ప్రాజెక్ట్ భూమి, ప్రహరీని పరిశీలించారు. నాలాను ఆనుకునే ప్రహరీ ఎలా నిర్మించారని ప్రశ్నించారు. చెరువు చుట్టూరా బఫర్, ఎఫ్‌టీఎల్‌లలో వచ్చిన నిర్మాణాల విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ విక్రంరెడ్డి, మణికొండ టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్‌తో పాటు హైడ్రా బృందం పాల్గొన్నారు.

'మెగాసిన్త్' టెక్నాలజీతో సీబీఐటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకున్న ప్రతినిధులు

మణికొండ: మెగాసిన్త్ టెక్నాలజీ సంస్థతో గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఓయూపై ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈసీఈ, ఐటీ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ పొందేందుకు సంస్థ తమ వంతు సహకారం అందిస్తుందని ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, సంస్థ ప్రతినిధి సింధూజ అన్నారు. కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ డొమైన్‌లో ప్రాజెక్టులను కొనసాగించడానికి ఇంటర్వ్యూ ప్రక్రియ ద్వారా విద్యార్థులకు నియామకాలు జరుగుతాయన్నారు. యూజీ, పీజీ విద్యార్థులకు పారిశ్రామిక నైపుణ్యంలో భాగంగా కోర్సు కంటెంట్, అతిథి ఉపన్యాసాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి నరహరి శాస్త్రి, అధ్యాపకులు గణేశ్వర్‌రావు, డాక్టర్ రమణరెడ్డి, గంగాధర్, డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోకాపేట చెరువు దత్తత

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేటలోని కొత్త చెరువును జెమిని ఎడిబ్లెస్, ఫాట్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ దత్తత తీసుకుంటుంది. చెరువు సుందరీకరణ, పునరుద్ధరణ పనులను సదరు సంస్థ చేపట్టనుందని అధికారులు తెలిపారు. దత్తత కార్యక్రమానికి శుక్రవారం హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రోపాలిటన్ జాయింట్ కమిషనర్ శ్రీవాత్సవ, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డావిస్, రాష్ట్ర సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేష్ హాజరవుతారని వారు వివరించారు.

స్లాబ్ సెంట్రింగ్ కూలి ఏడుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన కార్మికులను పరామర్శిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న భవనం స్లాబ్ సెంట్రింగ్ కూలింది. ఇందులో పని చేస్తున్న ఏడుగురు కార్మికులకు తీవ్ర గాయాలు కావడంతో వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ సందర్భంగా గాయపడిన కార్మికులకు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నిర్మాణంలో ఉన్న భవనం వద్ద స్లాబ్ కోసం సెంట్రింగ్ కొడుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఎలాంటి జాగ్రత్తలు పాటించకపోవడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. కార్మికుల ప్రాణాలతో చలగాటం ఆడుతున్న నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎంఈవో శంకర్‌రాథోడ్

అత్తాపూర్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ అన్నారు. అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివేకానంద జయంతిని పురస్కరించుకొని అనిమియా ముక్త భారత్ కార్యక్రమాన్ని భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంతంలోని త్రిశక్తి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పి.మహేందర్‌రెడ్డి, కోశాధికారి వి.శ్రీధర్, తెలంగాణ ప్రాంత ఎన్విరాన్‌మెంటల్ కన్వీనర్ డాక్టర్ రఘుసతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం త్రిశక్తి శాఖ వారు విద్యార్థులకు ఐరన్, విటమిన్ టాబ్లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ డి.శ్రీధర్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రజియాబేగడం, ఉపాధ్యాయురాలు రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత



రాజేంద్రనగర్: మనవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వామ్యం అయినప్పుడే దీనిని సమూలంగా నివారించవచ్చునని జడ్పీఎస్ఎస్ శివరాంపల్లి జీహెచ్ఎం కిషన్, ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బాలరామకృష్ణ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో శివరాంపల్లి జడ్పీఎస్ఎస్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ఒక రోజు ఓరియేంటేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మాట్లాడారు. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తుందన్నారు. ఉద్యోగం, ప్రేమపెళ్లి పేరుతో మోసం చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారన్నారు. టోల్ ఫ్రీ నంబర్లు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసు 100, మహిళా హెల్ప్‌లైన్ 181, సైబర్ హెల్ప్‌లైన్ 1930లపై వివరించారు. ప్రజ్వల సంస్థ గత 28 ఏళ్ల నుంచి 28,600 మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించిందన్నారు. ఈ సంస్థ వ్యవస్థాపకురాలు పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సునీత కృష్ణన్ సంబంధిత ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, పోలీసు, జ్యూడిషియల్, ఎడ్యూకేషన్ డిపార్టమెంట్ల సహకారంతో పని చేయడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రజ్వల తెలంగాణ స్టేట్ కో ఆర్డినేటర్ సురేశ్ కుమార్, సిబ్బంది అంబర్ సింగ్, మితాళి రాజ్, మండలంలోని వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులు



ఏజీవర్సిటీ: అల్వాల్‌లోని లయోలా అకాడమీకి చెందిన ఎంఎస్సీ బయోటెక్నాలజీ చదువుతున్న విద్యార్థులు గురువారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విశ్వవిద్యాయలంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీ, హర్టికల్చర్ గార్డెన్, అగ్రిఇన్నోహబ్, జాతీయ వరి పరిశోధనా సంస్థ, భారతీయ నూనెగింజల పరిశోధన కేంద్రాలను వారు పరిశీలించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు అంశాలల్లో విద్యార్థులకు వివరించారు. ప్రయోగశాలలో పలు ఎక్విప్‌మెట్లపై అవగాహన కల్పించారు. వీరి వెంట అసోసియెట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.శిరిషా, గురుదేవి, పద్మలత, విశ్వవిద్యాలయం పీఆర్‌ఓ సుధాకర్ ఉన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సర్వే చేస్తున్న డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుంది. సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న వెరిఫికేషన్ ప్రక్రియను ఉప కమిషనర్ రవి కుమార్ స్వయంగా గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి దరఖాస్తు వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ..గురువారం సాయంత్రానికి 26 వేల దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తయినట్లు వెల్లడించారు. అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్ల పరిధిలో 115 మంది సిబ్బంది దరఖాస్తులను ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబు



ముస్తాబైన వేంకటేశ్వర స్వామి ఆలయం

రాజేంద్రనగర్: వైకుంఠ ఏకాదశికి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఉత్తర ద్వారాన్ని అందంగా ముస్తాబు చేసి భక్తులకు ద్వారం ద్వారా స్వామి వారి దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం నుంచి ఆలయాలను వివిధ రకాల పూలు, పండ్లతో పాటు రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ఆలయాలను చూడముచ్చటగా అలంకరించారు. శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటల నుంచి ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారి దర్శనానికి తగు ఏర్పాట్లు చేపట్టారు. ప్రధానంగా రాజేంద్రనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం అందంగా ముస్తాబైంది. అలాగే ఎర్రబోడ, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి, హైదర్‌గూడ, అత్తాపూర్, బుద్వేల్ తదితర ప్రాంతాల్లోని దేవాలయాలను చూడముచ్చటగా అలంకరించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా భారీ ఏర్పాట్లు చేపట్టారు.

చైర్మన్, డైరెక్టర్లకు సన్మానం



రాజేంద్రనగర్: నార్సింగ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, డైరెక్టర్లను రాజేంద్రనగర్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు గురువారం సత్కరించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, నార్సింగ్ వ్యవసాయ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్‌ను గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కె.కృష్ణమాచారి, సత్యనారాయణ ముదిరాజ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విజేతగా బుద్వేల్ వారియర్స్

రాజేంద్రనగర్: మోయినాబాద్‌లో నాలుగు వారాలుగా జరుగుతున్న టీ 20-20 క్రికెట్ టోర్నమెంట్‌లో బుద్వేల్ వారియర్స్ విజేతలుగా నిలిచింది. గురువారం నిర్వహించిన ఫైనల్‌లో ప్రత్యర్థి జట్టును ఓడించి విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టును బుద్వేల్‌లో గురువారం రాత్రి స్థానికులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కెప్టెన్ ఎం.నరేశ్, శివ కుమార్, బండారి బాలకృష్ణ, చంటి, నర్సింగ్, కోరని వినోద్ కుమార్, శ్రీకాంత్, రమేశ్, ప్రశాంత్, చంటి, వి.కె.శ్రీశైలం, రిక్కీ, ప్రవీణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.



పిక్కెల్ బాల్ కోర్టు ప్రారంభం



రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లిలోని రాపిడసిజ్ బ్యాడ్మింటన్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీని గురువారం హైడ్రా కమిషనర్, ఐపీఎస్ ఏ.వి.రంగానాథ్ సందర్శించి పిక్కెల్ బాల్ కోర్టును ప్రారంభించారు. నగరంలో ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్న ఈ క్రీడ గురించి నిర్వాహకులు ఆయనకు వివరించారు. మాజీ ఐపీఎస్ అధికారి బాబురావు, బొక్క బాల్‌రెడ్డి, విశ్వేశ్వర్ రావు, ప్రకాశ్, శ్రీనాథ్, సరికొండ రాజు, కిశోర్, ప్రసాద్, కంపెనీ మేనేజ్‌మెంట్ సభ్యులు, ఇతర బ్యాడ్మింటన్ ప్లేయర్లు పాల్గొన్నారు.